సాక్షి విశాఖపట్నం

సోమవారం । 18 । సెప్టెంబర్ । 2023



భవిత కేంద్రాలు బలోపేతం
ప్రత్యేక అవసరాల పిల్లల కోసం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలు బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం దృష్టి సారించింది. 8లో



హద్దుల లెక్క తేలుతోంది
జగనన్న భూ హక్కు రీ సర్వే జిల్లాలో జోరుగా సాగుతోంది. ఫేజ్-1,2లో 34 గ్రామాల్లో విజయవంతంగా సర్వే పూర్తయింది. 8లో

వైభవంగా వైశాఖీ నృత్యోత్సవం
వైశాఖి నృత్యోత్సవం వైభవంగా ముగిసింది. దేశ నలుమూలల నుంచి ప్రఖ్యాత నాట్య కౌముదులు తరలి వచ్చి నాట్యం చేశారు. 8లో



న్యూస్‌రీల్

30 నుంచి ఏయూ తరగతులు



ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం బీటెక్, బీఆర్క్, ఎంటెక్, ఎంఆర్క్, ఎంసీఏ, ఎమ్మెస్సీ ప్రథమ సంవత్సరం తరగతులు ఈ నెల 30న ప్రారంభించనున్నారు. బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఇంజినీరింగ్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులను ద్దేశించి ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి ప్రసంగిస్తారు. అనంతరం తరగతులను లాంఛనంగా ప్రారంభిస్తారు. 2023–24లో ప్రవేశం పొందిన విద్యార్థులు ఆ రోజు ఉదయం 9 గంటలకు కన్వెన్షన్ సెంటర్‌కి చేరుకోవాలని ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు సూచించారు. విద్యార్థులు ఈ నెల 29న తమ విభాగంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. విద్యార్థులు ఈ నెల 28 నుంచి హాస్టల్స్‌లో ప్రవేశాలు పొందవచ్చన్నారు.

ముగిసిన జేసీఐ వీక్ జైత్ర



పృథ్వీరాజ్‌కు సేవా పురస్కారం అందిస్తున్న జేసీఐ ప్రతినిధులు

బీచ్‌రోడ్డు: జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్(జేసీఐ) ఆధ్వర్యంలో వారం రోజులుగా జరుగుతున్న 'వీక్ జైత్ర' ఆదివారంతో ముగిసింది. జేసీఐలోని వివిధ విభాగాల ప్రతినిధులు వారం రోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉచిత దంత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి.. వేలాది మందికి పరీక్షలు నిర్వహించిన వీ డెంటల్ ఆస్పత్రిని ఉత్తమ సేవా అవార్డుకు ఎంపిక చేశారు. రామ్‌నగర్‌లోని లయన్స్ క్లబ్‌లో జరిగిన ముగింపు వేడుకల్లో ఆస్పత్రి మేనేజర్ కె.పృథ్వీరాజ్‌కు ఈ అవార్డును ప్రదానం చేసి.. ఘనంగా సత్కరించారు. జేసీఐ వీక్ చైర్‌పర్సన్ ఫణి కల్యాణ్, విశాఖ ఎక్స్‌లెన్స్ చాప్టర్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, ప్రతినిధులు రాజేష్ ఉట్టి, భార్గవ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి సన్నిధిలో సీనియర్ న్యాయవాదులు



అమ్మవారికి పూజలు చేస్తున్న సీనియర్ న్యాయవాదులు

దాబాగార్డెన్స్ : తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయవాదులు పబ్బ రమేష్, కమ్మరి వెంకటాచారి మార్కండేయరాజు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తడక జగదీశ్వర్ గుప్తా ఆదివారం కనకమహాలక్ష్మిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వీరిచే వేదపండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

చట్టాలపై సాహిత్య ప్రభావం

ప్రముఖ రచయిత్రి ఓల్గా



సీతంపేట: సమాజంలో ఎలాంటి చట్టాలు రావాలన్నా దానిపై సాహిత్యం ఎప్పుడూ చర్చిస్తూ ఉంటుందని ప్రముఖ రచయిత్రి ఓల్గా అన్నారు. కొండపల్లి కోటేశ్వరమ్మ ఐదో వర్ధంతి సందర్భంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో 'చట్టం, సాహిత్యం' అను అంశంపై ఆమె స్మారకోపన్యాసం చేశారు. ఉన్న చట్టాలు, రాని చట్టాలపై విమర్శ కూడా చేస్తూ ఉంటుందని తెలిపారు. ప్రజల ఆకాంక్షలను రచయితలు అక్షరబద్ధం చేస్తారని, తిరిగి ప్రజలు ఆ రచనలను చదివి తమ ఆకాంక్షల్లో న్యాయం ఉందని గ్రహించి దానిచుట్టూ ఉద్యమం చేస్తారని ఫలితంగా చట్టం వస్తుందన్నారు. మనుషుల్లో సంస్కారం పెరుగుతున్న క్రమంలో సమాజాన్ని మార్చుకోవాలన్న ఆకాంక్ష పెరుగుతుందని, దానికి రచయితలు ఒక రూపం ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సూర్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సీహెచ్.రాఘవేంద్రరావు, ఎ.విమల, క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలుదారులతో పూర్ణామార్కెట్ కళకళ

సిటీలో గణేష్.. జోష్



గాజువాకలో ముస్తాబైన 117 అడుగుల వినాయక విగ్రహం

- మార్కెట్లకు వినాయక చవితి శోభ
- నేటి నుంచి గణేష్ నవరాత్రి ఉత్సవాలు

జగదాంబ: భక్త కోటి ఇష్టదైవం బొజ్జ గణపయ్య తొలి పూజకు వేళాయింది. సోమవారం నుంచి ప్రారంభం కానున్న నవరాత్రి ఉత్సవాల కోసం నగరం శోభాయమానమైంది. వినాయక చవితి వేడుకలకు మండపాలు అందంగా ముస్తాబయ్యాయి. మహా నగరం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. మరోవైపు వినాయక విగ్రహాలు, పూలు, పండ్లు, పూజా సామగ్రి తదితర వస్తువుల కొనుగోళ్లతో పూర్ణామార్కెట్, అక్కయ్యపాలెం, మధురవాడ, గాజువాక, కంచరపాలెం తదితర ప్రాంతాల్లోని మార్కెట్లు కళకళలాడాయి. ప్రధాన రహదారులకు ఇరువైపులా అమ్మకాలతో సందడి నెలకొంది.

పర్యావరణహిత మట్టి ప్రతిమల పట్ల నగరవాసులు ఆసక్తి చూపారు. స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల నేతలు, వివిధ సంస్థలు ఇప్పటికే వందలాది మట్టి విగ్రహాలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశాయి. మధురవాడ, కంచరపాలెం, అక్కయ్యపాలెం, గాజువాక, పెదగంట్యాడ తదితర ప్రాంతాల్లో భారీ వినాయక విగ్రహాల అమ్మకాలు ఆఖరి రోజైన ఆదివారం జోరుగా సాగాయి. విగ్రహాల తరలింపు, పూలు, పండ్లు, పూజా వస్తువుల కొనుగోళ్ల కోసం జనం పెద్ద ఎత్తున రహదారులపైకి చేరడంతో నగరంలోని పలు చోట్ల ఉదయం నుంచే ట్రాఫిక్ రద్దీ నెలకొంది.

వైవిధ్యమూర్తులు..

ఈ సారి కూడా వైవిధ్యభరితమైన విగ్రహమూర్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. బీహెచ్ఈఎల్ దరి గ్లోబెక్స్ థియేటర్స్ వద్ద 112 అడుగుల విగ్రహం, పాతగాజువాక దరి లంకా మైదానంలో 117 అడుగుల విగ్రహం, దొండపర్తిలోని రామాలయం వద్ద 108 అడుగుల భారీ గణనాథుడి విగ్రహాలు ముస్తాబయ్యాయి. వీటితో పాటు అర్ధనారీశ్వరుడి సమక్షంలో కొలువైన బొజ్జ గణపయ్య, బహు ముఖ వినాయకుడు, భక్తుల మదిని దోచే వివిధ రకాల భంగిమలు, ఆకృతులతో, చక్కటి రంగులతో అద్భుతంగా తీర్చిదిద్దిన విగ్రహాలు ఇప్పటికే మండపాలకు చేరుకున్నాయి.

సందడిగా మార్కెట్లు.. ధరలకు రెక్కలు

వినాయక చవితి సందర్భంగా పూజ కోసం వినియోగించే 21 రకాల పత్రి, బంతి పూలు, మామిడి ఆకులు, మారేడు కాయల అమ్మకాలతో మార్కెట్లలో సందడి నెలకొంది. పండగ సందర్భంగా పూల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. హోల్ సేల్ మార్కెట్‌లో బంతిపూలు కిలో రూ.90 వరకు ఉంటే పూల దుకాణాల వద్ద కిలో రూ.150 వరకు విక్రయించారు. పూర్ణా మార్కెట్‌లో 50 గ్రాముల పువ్వులు రూ.100 పైగా అమ్మకాలు జరిపారు. చామంతి పూలు, గులాబీ, తదితర పువ్వుల ధరలు సైతం భారీగా పెరిగాయి.



పువ్వులు కొనుగోలు చేస్తూ..



ఓ బొజ్జ గణపయ్య.. మా ఇంటికి రావయ్యా..



పండ్లు కొనుగోలు చేస్తూ..

రావయ్యా.. గణపయ్య



బాలయ్యశాస్త్రిలే అవుట్‌లో పూజలందుకోనున్న పార్వతీ తనయుడు

అల్లిపురం: యువత ఉల్లాసంగా ఉత్సాహంగా జరుపుకునే పండగల్లో వినాయక చవితి ఒకటి. యువత, చిన్న పిల్లలు తమకు ఇష్టమైన విగ్రహాన్ని కొనుక్కొని.. తమ ప్రాంతాల్లో ప్రతిష్ఠించి ఎంతో ఆనందంగా ఉత్సవాలు నిర్వహిస్తారు. రాట వేసిన మొదలు.. మండపం తయారీ, విగ్రహం తీసుకురావడం, నవరాత్రి పూజలు, చివరకు నిమజ్జనం వరకు ఒకటే సందడి నెలకొంటుంది. సోమవారం నుంచి వినాయక చవితి వేడుకలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆదివారం పలు ప్రాంతాల్లో వినాయక విగ్రహాలను బోలో గణేష్ మహారాజ్‌కీ.. జై అంటూ మండపాల వద్దకు తరలించారు. వన్‌టౌన్ పాత లక్ష్మీ టాకీస్ ప్రాంతంలో నెలకొన్న సందడిని ఈ చిత్రాల్లో చూడొచ్చు.



వ్యాన్‌లోకి విగ్రహాన్ని ఎక్కిస్తూ...



విగ్రహాన్ని మండపానికి తరలిస్తున్న యువకులు



జై బోలో గణేష్ మహరాజ్‌కీ జై

నగర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

దాబాగార్డెన్స్: వినాయక చవితి సందర్భంగా జిల్లా ప్రజలకు వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరికీ గణనాథుని ఆశీస్సులు ఉండాలని, క్షేమ, స్థైర్య, ఆయురారోగ్యాలు, సకల సంపదలు సిద్ధించాలని, సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు.

- ప్రజలకు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరిసేలా.. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో గణపతి నవరాత్రులను జరుపుకోవాలని సూచించారు.

స్వచ్ఛతలో టాప్‌లో నిలుద్దాం



విద్యార్థులతో మేయర్ హరివెంకటకుమారి, కలెక్టర్ మల్లికార్జున, ఒలింపిక్ విజేత కరణం మల్లేశ్వరి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తదితరులు

- మేయర్ హరివెంకటకుమారి పిలుపు
- బీచ్‌లో స్వచ్ఛత లీగ్ 2.0 ప్రారంభం
- హాజరైన ఒలింపిక్ విజేత మల్లేశ్వరి

బీచ్‌రోడ్డు: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖ నగరాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు అందరి సహకారం అవసరమని మేయర్ గొలగాని హరివెంకటకుమారి పిలుపునిచ్చారు. ఆర్.కె.బీచ్‌లో ఆదివారం జీవీఎంసీ నిర్వహించిన స్వచ్ఛత లీగ్ 2.0 కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2022లో టాప్ ఇంపాక్ట్ క్రియేటర్ అవార్డు సాధించామని.. ఈ ఏడాది ఈ అవార్డు దక్కించుకోవడం కోసం ఎకో వైజాగ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆర్.కె.బీచ్‌తో పాటు రుషికొండ, కైలాసగిరి, వీఎంఆర్డీఏ పార్క్‌ల్లో స్వచ్ఛతతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో విశాఖను ప్లాస్టిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. భావితరాలకు మంచి ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు అందరం కృషి చేద్దామన్నారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ స్వచ్ఛత లీగ్‌లో ఈ ఏడాది కూడా అవార్డు పొందేందుకు ప్రజలను భాగస్వామ్యం చేసేలా విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మన నగరాన్ని మనమే శుభ్ర పరచుకోవాలన్నారు. దిగ్గజ వెయిట్ లిఫ్టర్, ఒలింపిక్ విజేత కరణం మల్లేశ్వరి మాట్లాడుతూ విశాఖ.. సుందరమైన నగరమని, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు వంశీరెడ్డి, లేళ్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రుషికొండ బీచ్‌లో..

కొమ్మాది: స్వచ్ఛతలో విశాఖను ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0 కార్యక్రమంలో భాగంగా ఆదివారం రుషికొండ బీచ్‌లో నిర్వహించిన ఎకో వైజాగ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా స్కూబా డైవ్ ద్వారా సముద్ర గర్భంలోకి వెళ్లి వ్యర్థాలను సేకరించారు. ఎకో వైజాగ్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, సీఎంహెచ్‌వో నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్కూబా డైవ్ ద్వారా సముద్రంలో వ్యర్థాలను తీసుకొచ్చిన జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

విశ్వకర్మ.. గొప్ప రూపశిల్పి

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్



విశ్వకర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి అమర్‌నాథ్, మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి, నాగిరెడ్డి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు తదితరులు

కొమ్మాది: ఎండాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం విశ్వకర్మ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్.. మేయర్ గొలగాని హరివెంకట కుమారితో కలిసి విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విశ్వకర్మ గొప్ప ఆర్కిటెక్చర్ అని కొనియాడారు. అనంతరం పార్టీ కార్యాలయ ప్రాంగణంలోని రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేడ్కర్, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి జి.రవిరెడ్డి, వివిధ విభాగాల కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..

మహారాణిపేట: కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం విశ్వకర్మ జయంతి కార్యక్రమం జరిగింది. జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా రావాల్సిన రాయితీలను విశ్వ బ్రాహ్మణులను అందిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీదేవి, విశ్వ బ్రాహ్మణ సంఘ నాయకులు కె.లక్ష్మణరావు, ఎస్.శ్రీనివాసరావు, ఆర్.లక్ష్మణరావు, ఎస్.కుమార్, ఇతర అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

జీవీఎంసీలో...

దాబాగార్డెన్స్: వేదాల ప్రకారం విశ్వకర్మయే సృష్టికర్తని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం విశ్వకర్మ జయంతి నిర్వహించారు. ముందుగా విశ్వకర్మ చిత్రపటానికి మేయర్‌తో పాటు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, పలువురు అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, జీవీఎంసీ అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఎస్ఎస్ వర్మ, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, కార్యదర్శి పి.నల్లనయ్య, డిప్యూటీ ఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.



విశ్వకర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కల్యాణి, జేసీ విశ్వనాథన్



విశ్వకర్మ జయంతిలో పాల్గొన్న మేయర్, కమిషనర్, పలువురు అధికారులు

అందరూ స్వామి సేవకులే...

- టీమ్ వర్క్‌తో ముందుకెళ్తా..
- సింహాచలం దేవస్థానం ఈవోగా శ్రీనివాసమూర్తి బాధ్యతల స్వీకరణ

సింహాచలం: అందరి సహకారంతో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తానని, అందరూ స్వామివారి సేవకులేనని భావిస్తానని కొత్త ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. దేవస్థానం ఈవోగా ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. సింహగిరికి ఉదయం కుటుంబసమేతంగా వచ్చిన ఆయన తొలుత ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అనంతరం ఆయన బాధ్యతల స్వీకరణ పత్రాలపై సంతకాలు చేశారు. గత ఈవో వి.త్రినాథరావు ఆయన్ని సత్కరించి స్వామివారి జ్ఞాపికను అందజేశారు.

అనంతరం శ్రీనివాసమూర్తి మీడియాతో మాట్లాడారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి ఈవోగా రావడం భగవంతుడు కల్పించిన అదృష్టంగా భావిస్తానన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అందరి సహకారంతో దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా టీమ్ వర్క్‌తో ముందుకు వెళ్తామన్నారు. స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎంత మంచి దర్శనం అందించగలమన్న విషయంపై ప్రధానంగా దృష్టిసారిస్తానన్నారు. భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. భక్తుల సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుంటానన్నారు. ప్రతి నెలా మీడియాతో కూడా సమావేశం ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, సువ్వాడ శ్రీదేవి, దొడ్డి, రమణ, దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ఏఈవోలు, సూపరింటెండెంట్లు ఈవోని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



ఈవో త్రినాథరావు నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసమూర్తి

తొలిరోజు అన్ని విభాగాల్లోనూ పర్యటన

ఈవోగా బాధ్యతలు స్వీకరించిన తొలిరోజే శ్రీనివాసమూర్తి దేవస్థానంలోని అన్ని విభాగాల్లోను పర్యటించారు. ఆయా విభాగాలను సందర్శించి పాలనా వ్యవహారాలను అడిగి తెలుసుకున్నారు. దేవస్థానం పరిపాలన కార్యాలయంలో విభాగాధిపతులు, సిబ్బందితో మాట్లాడారు. అన్నప్రసాద భవనాన్ని సందర్శించి డైనింగ్ హాల్, కిచెన్ తదితర ప్రదేశాలను పరిశీలించారు. వేద పాఠశాలను సందర్శించి వేద విద్యార్థులతో మాట్లాడారు. దేవస్థానం ఏఈవో రమణమూర్తి, ఇన్‌చార్జి ఏఈవో పాలూరి నరసింగరావు తదితరులు ఆయన వెంట ఉన్నారు.



భూముల హద్దుల లెక్క తేలుతోంది

- జిల్లాలో శరవేగంగా భూహక్కు రీసర్వే
- తొలి రెండు విడతల్లో 34 గ్రామాల్లో సర్వే పూర్తి
- మూడో విడతలో 40 గ్రామాలు, నాలుగో ఫేజ్ లో 8 గ్రామాలు
- 11 గ్రామాల్లో 14,022, 23 గ్రామాల్లో 28,860 హద్దు రాళ్ల ఏర్పాటు పూర్తి


నేరెళ్లవలస వద్ద పూర్తయిన భూహక్కు రీసర్వే

సాక్షి, విశాఖపట్నం : జగనన్న భూ హక్కు రీ సర్వే జిల్లాలో జోరుగా సాగుతోంది. మొదటి రెండు ఫేజ్‌లలో 34 గ్రామాల్లో విజయవంతంగా పూర్తి చేసిన అధికారులు.. మూడు, నాలుగు విడతల్లో 48 గ్రామాల భూ సరిహద్దులతో పాటు గ్రామాలకూ సాంకేతిక హద్దులు గుర్తించనున్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా వందేళ్ల తర్వాత రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వే జిల్లాలోనూ నిర్వహిస్తున్నారు. అస్తవ్యస్తంగా, తప్పుల తడకగా ఉన్న భూ రికార్డులను స్వచ్ఛీకరణ చేసి, వివాదాలను పూర్తిగా రూపు మాపడమే లక్ష్యంగా రీ సర్వే జరుగుతోంది. నౌకాదళ పరిధిలో కొన్ని గ్రామాలుండటం వల్ల.. రీ సర్వేకు ఇబ్బందులు ఎదురవడంతో ఆలస్యమైంది. నేవీ అధికారులతో జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జున సంప్రదింపులు జరిపి నేవీ పరిధిలో ఉన్న గ్రామాల్లోనూ డ్రోన్ సర్వేకు అనుమతులు తీసుకొని శరవేగంగా పూర్తి చేశారు. ఆర్థోరెక్టిఫైడ్ రేడార్ ఇమేజ్(ఓఆర్ఐ) మ్యాప్‌ల సహాయంతో సర్వే పనులు జోరుగా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ సర్వే ఆఫ్ ఇండియా సహకారంతో రీ సర్వే చేపడుతోంది. మొదటి విడతలో 11 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి 14,022 సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. రెండో విడతలో 23 గ్రామాల్లో సర్వే పూర్తి చేశారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో 28,860 రాళ్ల ఏర్పాటు ప్రక్రియ దాదాపు పూర్తయింది. మూడో విడతలో 40 గ్రామాలు, నాలుగో విడతో స్వల్ప వివాదాలు, సాంకేతిక సమస్యలున్న 8 గ్రామాలు పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. అయితే.. సాంకేతిక సమస్యలను పరిష్కరించి మూడో విడతలోనే 48 గ్రామాలను పూర్తి చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు.

గ్రామాలకూ సాంకేతిక హద్దులు



వీలైనంత త్వరగా రీసర్వే పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. క్షేత్రస్థాయిలో ప్రతి భూమికి జియో సరిహద్దుల్ని జియో ట్యాగింగ్ ద్వారా నిర్ణయిస్తున్నాం. కేవలం నాలుగు దిశల్లో మాత్రమే కాకుండా.. ప్రతి ప్రాంతంలో ఎన్ని స్థలాలున్నాయో.. ప్రతి దిశలోనూ ప్రతి పాయింట్‌కు జియో కోడ్‌ని ఏర్పాటు చేస్తున్నాం. ఒక్కో వ్యక్తికి ఉన్న భూ సరిహద్దు ఎంత అనే దానికి స్పష్టమైన కోడ్ పొందుపరుస్తున్నాం. ప్రతి గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములకు ప్రత్యేక కోడ్‌ని పెడుతున్నాం. వీటితో పాటు.. ప్రతి గ్రామానికి కూడా జియో కోడ్‌లతో సాంకేతిక సరిహద్దుల్ని ఏర్పాటు చేసే ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఇప్పటికే ఆయా గ్రామాలకు సరిపడిన సరిహద్దు రాళ్లు జిల్లాకు చేరుకున్నాయి.

– కె.ఎస్.విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్

భవిత కేంద్రాలు బలోపేతం

- ఖాళీల భర్తీకి శరవేగంగా ఏర్పాట్లు
- ఏడేళ్ల తరువాత కేంద్రాల్లో నియామకాలు
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 37 ఐఈఆర్పీ పోస్టులకు నోటిఫికేషన్
- ఈ నెల 18 వరకు దరఖాస్తుల ఆహ్వానం
- అక్టోబర్ 11న విధుల్లో చేరేలా షెడ్యూల్


అక్కయ్యపాలెంలోని భవిత కేంద్రం

విశాఖ విద్య: ప్రత్యేక అవసరాల పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి, వారికి బాసటగా నిలిచేందుకు ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలు బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం దృష్టి సారించింది. కేంద్రాల్లో విద్యాబోధనకు రిసోర్స్ పర్సన్స్ నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు యుద్ధప్రాతిపదికన ఖాళీల భర్తీకి విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఏడేళ్ల తరువాత మళ్లీ భవిత కేంద్రాల్లో ఐఈఆర్పీల నియామకాలు జరుగుతున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికన చేపట్టే నియామకాలకు ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశారు. డిగ్రీ అర్హతతో స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సు చేసి, ఉద్యోగాల కోసమని ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న అభ్యర్థులకు ఊరటనిచ్చేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమౌతుంది.

ఉమ్మడి జిల్లాలో 37 ఖాళీలు భర్తీ

ఉమ్మడి విశాఖ జిల్లాలో 37 ఐఈఆర్పీలను భర్తీ చేసేందుకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. విశాఖ జిల్లాలో 11, అనకాపల్లి జిల్లాలో 24, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 22 భవిత కేంద్రాలు ఉండగా, వీటిలో ప్రస్తుతం 37 ఖాళీలు ఉన్నాయి. వీటన్నింటినీ ప్రస్తుత నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేసేలా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ప్రతీ భవిత కేంద్రంలో ఇద్దరు ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ (ఐఈఆర్పీ) ఉండాలి. కానీ అల్లూరి జిల్లాలో రెండు చోట్ల మినహా, మిగతా కేంద్రాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీని వల్ల కేంద్రాల నిర్వహణలో ఇబ్బందులు ఎదురయ్యాయి. గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. క్షేత్రస్థాయిలో పరిస్థితులపై పూర్తి నివేదిక తెప్పించుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేంద్రాల్లో ఖాళీలన్నీ భర్తీ చేసేందుకు అనుమతిచ్చింది.

షెడ్యూల్ ఇది ..

- ఈ నెల 18వ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- 19 నుంచి 22 మధ్యలో ప్రతి పోస్టుకు ఐదుగురు చొప్పున రాష్ట్ర కార్యాలయం నుంచి మెరిట్ లిస్టు విడుదల చేస్తారు.
- 23న జిల్లా కార్యాలయంలో మెరిట్ లిస్టు అందుబాటులో ఉంటుంది.
- 25 ,26 తేదీల్లో మెరిట్ లిస్టుపై అభ్యంతరాలను స్వీకరిస్తారు.
- 27న ఫైనల్ జాబితా తయారు చేస్తారు.
- 28 నుంచి 30 వరకు అభ్యర్థుల సర్టిఫికెట్లను జిల్లా స్థాయి కమిటీ ఆధ్వర్యంలో పరిశీలిస్తారు.
- అక్టోబర్ 3 నుంచి 5వ తేదీ వరకు స్కిల్ టెస్ట్/పర్సనాలిటీ టెస్ట్/ ఇంటర్వ్యూలను జిల్లా కమిటీ నిర్వహిస్తుంది.
- 6న ఫైనల్ జాబితా విడుదల చేస్తారు.
- 7న ఎంపికైన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు జారీ చేస్తారు.
- 9,10 తేదీల్లో ఉద్యోగాల్లో చేరేందుకు సమ్మతిస్తూ అగ్రిమెంట్ ఇవ్వాల్సి ఉంటుంది. 11న విధుల్లో చేరాలి.

పారదర్శకంగా నియామకాలు



భవిత కేంద్రాల్లో ఐఈఆర్పీల నియామకానికి నోటిఫికేషన్ జారీ అయింది. ఆసక్తి ఉన్న అర్హులైన అభ్యర్థులు తగిన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి. నియామకాలపై రాష్ట్ర ఉన్నతాధికారుల పూర్తి స్థాయి పర్యవేక్షణ ఉంటుంది. అంతా పారదర్శకంగానే నియామకాలు ఉంటాయి.

– బి. శ్రీనివాసరావు, ఏపీసీ, సమగ్ర శిక్ష, ఉమ్మడి విశాఖ జిల్లా

పిల్లలకు మేలు జరుగుతుంది



ప్రత్యేక అవసరాల పిల్లలకు మేలు కోసమని భవిత కేంద్రాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. గతంలో వీటిపై పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. కానీ ప్రస్తుత ప్రభుత్వం కేంద్రాల నిర్వహణతో పాటు, వీటిలో ఉన్న ఖాళీల భర్తీ చేస్తుండటం వల్ల పిల్లలకు మేలు జరుగుతుంది. నియామక ప్రక్రియ అంతా పారదర్శకంగా చేపట్టేలా అధికారులు శ్రద్ధ తీసుకోవాలి

– డాక్టర్ జి. సీతారాం, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి

పెదగంట్యాడ: ఆత్మరక్షణ విద్యల్లో కరాటే ముందుంటుందని, అటువంటి కరాటేనే నేర్చుకునేందుకు విద్యార్థులు ఆసక్తి చూపిస్తుంటారని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. రెన్షీ సుమన్ కోరాడ, ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో స్థానిక క్షత్రియ కల్యాణ మండపంలో 15వ ఏపీ స్టేట్ కెన్ యూ–ర్యూ కరాటే చాంపియన్‌షిప్ పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలకు పెట్టింది పేరు గాజువాక అని పేర్కొన్నారు. ఎంతోమందికి కరాటేలో శిక్షణ ఇచ్చి వారిని నిష్ణాతులుగా తీర్చిదిద్దిన ఘనత కోరాడ సుమన్‌కే దక్కుతుందని కొనియాడారు. రెన్షీ సుమన్ కోరాడ మాట్లాడుతూ ప్రతి ఏడాది రాష్ట్ర స్థాయిలో కరాటే పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 11 జిల్లాల నుంచి 550 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, వైఎస్సార్ సీపీ క్లస్టర్ 1 అధ్యక్షుడు ధర్మాల శ్రీను, కోచ్‌లు మోడీ నాయుడు, పి.శివ ప్రసాద్, ఎండీ నాయుడు, ఢిల్లీశ్వరరావు, ఉమా మహేష్, ఆనంద్ బాలు తదితరులు పాల్గొన్నారు.

తండ్రి, కొడుకుని కాపాడిన లైఫ్‌గార్డ్స్


కాపాడిన లైఫ్‌గార్డ్స్‌తో తండ్రి, కొడుకు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో కొట్టుకుపోతుండగా తండ్రి, కొడుకుని లైఫ్ గార్డ్స్ కాపాడారు. సత్తన్నపల్లికి చెందిన మేరి, నైమ్ కుటుంబంతో కలిసి ఆదివారం సాయంత్రం సరదాగా గడిపేందుకు ఇక్కడి బీచ్‌కు వచ్చారు. ఈ క్రమంలో స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. అలల తాకిడికి వీరిద్దరూ కొట్టుకుపోతుండగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్ సూరాడ నూకరాజు, ఎమ్.చందు, సతీష్ గమనించి సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు.

మా కస్టమర్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు వినాయక చవితి శుభాకాంక్షలు
VANI LODGE
A/C ROOMS & NON A/C ROOMS
Opp. HOTEL DOLPHIN, VISAKHAPATNAM-04
Cell: 98663 88457, 70933 80084
Ph: 0891-6604111

వినాయక చవితి శుభాకాంక్షలు
MAHILA SPICES
ఏరియాల వారీగా డిస్ట్రిబ్యూటర్స్ కావలెను
MAHILA HOME PRODUCTS
Ph: 95733 34447, 98853 13433, 63002 51449

భెల్ సొసైటీ బడ్జెట్ ఆమోదంపై చర్చ

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ 54వ సర్వసభ్య సమావేశం ఆదివారం సొసైటీ కార్యాలయంలో జరిగింది. 2022 –23వ ఆర్థిక సంవత్సర ఆడిట్ రిపోర్టును ఆమోదించేందుకు సమావేశంలో చర్చించారు. 2022–23 సంవత్సరానికి సవరించిన ఆర్థిక ఆదాయం–వ్యయం, 2023 –24 సంవత్సరానికి ఆదా యం – వ్యయం అంచనా బడ్జెట్ ఆమోదించడంపై సభ్యులు చర్చించారు. సంఘం సభ్యులు మరణించినప్పుడు రూ.2 లక్షలు బీమా వర్తించేలా నూతన పాలసీ అమలు, సభ్యులకు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసుకునే అవకాశం తదితర అంశాలపై చర్చించారు. కార్యదర్శి ఎం.వెంకటరాజు తన నివేదికను చదివి వినిపించారు. ప్రస్తుతం సొసైటీలో 449 మంది ఉద్యోగులు సభ్యులుగా ఉన్నారన్నారు. ఇటీవల సభ్యులకు రూ. 1.50 లక్షలు రుణపరిమితిని రూ. 2 లక్షల వరకు పెంచామన్నారు. కార్యక్రమంలో పాలకవర్గం అధ్యక్షుడు కె.రామునాయుడు, ఉపాధ్యక్షుడు కె.ధర్మారావు, డైరెక్టర్లు జీటీపీ ప్రకాష్, జి.ప్రసాద్, కేఎస్‌వీ ప్రసాద్, ఎస్‌బీ ప్రశాంత్ కుమార్, వి.గోవిందరావు, మేనేజర్ వెంకట రమణారావు, ఆఫీస్ అసిస్టెంట్ ఎం.డి.అమీరుద్దీన్ పాల్గొన్నారు.

పరామర్శకు వెళుతూ అనంతలోకాలకు..

గుర్తు తెలియని లారీ ఢీకొట్టడంతో యువకుడి మృతి


హేమంత్(ఫైల్)

గోపాలపట్నం: కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బంధువును పరామర్శించేందుకు వెళ్తున్న యువకుడ్ని షీలానగర్ సమీపంలోని సోలార్ ప్లాంట్ వద్ద గుర్తుతెలియని లారీ ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి పట్టణంలోని రామభద్రాపురం సమీపంలోని ఏఎంఏఎల్ కళాశాల సమీపంలో నివాసముంటున్న యడ్ల హేమంత్ కుమార్ (26) శనివారం రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో కేజీహెచ్‌లో బంధువును పరామర్శించేందుకు తన స్నేహితుడితో ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. షీలానగర్ మీదుగా వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని లారీ ఢీకొట్టడంతో వెనుక కూర్చున్న హేమంత్ కుమార్ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం నడుపుతున్న హేమంత్ స్నేహితుడు రమేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతుడు హేమంత్ ఏషియన్ పెయింట్స్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. మృతుడికి తల్లి, తమ్ముడు ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ట్రాఫిక్ ఏడీసీపీ జీ శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్ కుమార్, కంచరపాలెం సీఐ మళ్ల అప్పారావు ఆదివారం సంఘటన స్థలంలో వివరాలు సేకరించారు. ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలను పరిశీలించారు. మృతుడు తమ్ముడు మల్లికార్జునరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని యువకుడి మృతి


మహేష్ (ఫైల్)

కూర్మన్నపాలెం : విద్యుత్ స్తంభాన్ని బైక్ ఢీకొనడంతో యువకుడు మృతి చెందగా.. మరో ఇద్దరు గాయపడ్డారు. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం చినగంట్యాడకు చెందిన కనిమెరక మహేష్ (15) మూడు రోజులుగా వినాయక మండపాన్ని ఏర్పాటు చేస్తున్నాడు. శనివారం రాత్రి మండపం వద్ద పడుకుని ఉదయం వస్తానని తల్లి భారతికి చెప్పి వెళ్లాడు. ఆదివారం ఉదయం 10.30 గంటలు అయినా రాక పోయేసరికి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. పదేపదే చేస్తుండగా ఓ వ్యక్తి ఫోన్ లిఫ్ట్ చేసి ముగ్గురు యువకులు అప్పికొండ వద్ద బైక్‌ను విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నారని, అందులో ఒకరు మృతి చెందాడని సమాధానం చెప్పడంతో వెంటనే మహేష్ కుటుంబ సభ్యులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. మృతుడు మహేష్‌గా గుర్తించి కన్నీరుమున్నీరయ్యారు. గాయపడిన మరో ఇద్దరు యువకులు దినేష్, భరత్‌గా గుర్తించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. తల్లి భారతి ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రోన్ల ట్రయల్ రన్!

- భీమిలి మండలంలో ప్రయోగాత్మకంగా ప్రదర్శన
- జిల్లాలో నలుగురు పైలట్ల ఎంపిక
- వచ్చే నెలలో అమరావతిలో వీరికి శిక్షణ
- రెండు మూడు నెలల్లో అందుబాటులోకి డ్రోన్లు


వరి పంటపై పురుగు మందును పిచికారి చేస్తున్న డ్రోన్

సాక్షి, విశాఖపట్నం: రైతుకు పెట్టుబడి భారాన్ని తగ్గించే డ్రోన్లు అందుబాటులోకి రానున్నాయి. పంటల చీడపీడలను నివారించేందుకు ఇన్నాళ్లూ మనుషులతోనే పురుగుమందులను పిచికారి చేయిస్తున్నారు. దీనివల్ల రైతులకు కూలీ భారం పెరిగిపోవడమే కాదు.. పిచికారీ చేసేవారికి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఇకపై ఆ పనిని డ్రోన్లే చేయనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ డ్రోన్ల కొనుగోలుకు రాయితీ ఇవ్వడమే గాక, వాటిని ఆపరేట్ చేసే పైలట్లకు శిక్షణను కూడా ఇస్తూ ప్రోత్సహిస్తోంది. ప్రాథమికంగా మండలానికి ఒకటి, అవసరమైతే రెండు చొప్పున డ్రోన్లను మంజూరు చేస్తోంది. ఐదుగురు రైతులతో ఒక గ్రూపు ఏర్పాటైతే వారికి ఒక డ్రోన్‌ను కేటాయిస్తుంది. వీరిలో ఇంటర్మీడియట్ విద్యార్హత, పాస్‌పోర్టు కలిగిన వ్యక్తికి డ్రోన్ పైలట్‌గా అమరావతిలో 15 రోజుల పాటు శిక్షణ ఉంటుంది. అక్కడ శిక్షణ పొందిన తర్వాత డ్రోన్ కొనుగోలు చేస్తే ఆ సొమ్ములో ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇస్తుంది. విశాఖ జిల్లాలో 11 మండలాలకు గాను ఏడు మండలాలు అర్బన్ పరిధిలో ఉన్నాయి. పెందుర్తి, భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో మాత్రమే పంటలు సాగవుతున్నాయి. అందువల్ల ఈ నాలుగు మండలాలకు ఆరు డ్రోన్లు మంజూరయ్యాయి. విశాఖ జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులు రైతు గ్రూపులను, పైలట్లను ఎంపిక చేశారు. వీరిలో ఇప్పటికే పెందుర్తి మండలానికి చెందిన ఎల్.లక్ష్మీనారాయణ అనే పైలట్ అమరావతిలో శిక్షణ కూడా పూర్తి చేసుకుని వచ్చారు. ఈయనతో భీమిలి మండలం తాటితూరులో ఇతర గ్రూపుల సభ్యులకు డ్రోన్‌తో గురువారం ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. పురుగు మందులు, సూక్ష్మ పోషక ఎరువుల పిచికారి విధానంతో పాటు డ్రోన్ టెక్నాలజీపై వీరికి అవగాహన కల్పించారు. దీనిని మరి కొద్ది రోజులు కొనసాగిస్తామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎ.అప్పలస్వామి 'సాక్షి'కి చెప్పారు. ఎంపిక చేసిన పైలట్లను శిక్షణ కోసం త్వరలో అమరావతి పంపిస్తామన్నారు. మరో రెండు మూడు నెలల్లో జిల్లాలో డ్రోన్లు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

డ్రోన్లతో ప్రయోజనాలివీ..

ఒక్కో డ్రోను ఖరీదు రూ.6.50 నుంచి 9 లక్షల వరకు ఉంటుంది. ఎంపికైన గ్రూపు సభ్యులు డ్రోన్ కొనుగోలుకు ఈ సొమ్ములో ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇస్తుంది. డ్రోన్ల వినియోగంతో రైతులకు ఎంతో మేలు జరగనుంది. సాధారణంగా ఒక ఎకరం పొలంలోని వరిపంటకు పురుగు మందు పిచికారి చేయాలంటే 150–200 లీటర్ల మందు కలిపిన నీరు అవసరమవుతుంది. స్ప్రే చేసే కూలీకి 3–4 గంటల సమయం పడుతుంది. అదే 10 లీటర్ల సామర్థ్యం ఉన్న డ్రోన్‌తో పిచికారి చేయడానికి 15 నిమిషాలు సరిపోతుంది. దీంతో సమయం ఆదా అవుతుంది. అంతేకాదు అనారోగ్యం బారినపడతామన్న భయంతో పంట చేలకు పురుగు మందులు చల్లడానికి కూలీలు దొరకడం లేదు. దీంతో సాధారణ కూలీకంటే ఎక్కువ సొమ్ము చెల్లించాల్సి వస్తోంది. పైగా కూలీల కొరత వల్ల సకాలంలో పిచికారీ చేయలేకపోవడంతో పంట తెగుళ్ల బారిన పడి దెబ్బతింటోంది. ఇప్పుడు ఈ డ్రోన్లు అందుబాటులోకి వస్తే సమయం, సొమ్ము ఆదా అవుతుంది. కూలీల కొరత తీరుతుంది. పైగా ఈ డ్రోన్లతో పురుగు మందులతో పాటు సూక్ష్మ పోషక ఎరువులను కూడా పిచికారి చేసుకునే వీలు కూడా ఉంది. ఇలా డ్రోన్లు రైతులకు ఎంతో ప్రయోజనకారులవుతాయని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు.

ఆర్ఐఎంసీలో ఎనిమిదో తరగతిలో ప్రవేశాలు

సింథియా: డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ కాలేజ్(ఆర్ఐఎంసీ)లో 8వ తరగతిలో ప్రవేశానికి సంబంధించి ప్రవేశపరీక్ష నోటిఫికేషన్ విడుదలైంది. డిసెంబర్ 2న జరిగే ప్రవేశ పరీక్షకు అక్టోబరు 15లోగా దరఖాస్తు చేసుకోవాలి. 7వ తరగతి చదువుతున్న లేదా ఏడో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. రాత పరీక్ష, వైవా–వాయిస్, వైద్య పరీక్షల ఆధారంగా విద్యార్థుల ఎంపిక ఉంటుంది. దరఖాస్తులు https://rimc.gov.in లో పొందవచ్చు.

కోడిగుడ్ల ధరలు	రూ.లలో (వందకు)
విశాఖ	525.00
విజయనగరం	529.00
శ్రీకాకుళం	529.00

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ ONE SITTING 10th, 12th, B.A., B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., B.Ed., BBA, BCA, MBA, Nursing Pharmacy, Dip. In VET. B.Tech., from Recog., Universities in India. (for Discontinued) Exams in September/October ✆ : 73383 76874 [R-98]

Real Estate

FLAT FOR SALE

■ 3 BHK Flat 1645 Sft Road Facing at Madhurawada Flat For Sale. Contact : 92900 76667 [V-2139]

FARM LAND FOR SALE

■ సుదేనా అగ్రో ఫామ్స్ వారి నూతన వెంచర్, కేవలం గజం661/- రూ. మాత్రమే, ఎర్రవందనం,ఫామ్‌ల్యాండ్,విజయవంతంగా 6 వెంచర్లు కంప్లీట్ చేసుకుని, 7వ వెంచర్ మీ ముందు వచ్చింది. అతిపెద్ద మెగా100ఎకరాలు వెంచర్, కనిగిరికి అతి సమీపంలో.ఫోన్ : 9030419029 [H-189592]

HOUSE FOR SALE

■ పెందుర్తి క్రొత్త హైవేకి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ లే అవుట్‌లో E/F 130 చ॥ గ॥ సెల్లార్ + 2BHK క్రొత్త ఇండిపెండెంట్ ఇల్లులు (2) నిర్మించి ఇవ్వబడును. లోన్ సౌకర్యం. ఫోన్ : 81431 42265 [V- 2718]

■ సాయి గోల్డెన్ వెంచర్స్ వారి వినాయక చవితి శుభాకాంక్షలు. విజయనగరం లోకల్‌లో ఇండిపెండెంట్ 2 BHK ఇల్లు కేవలం 35 లక్షలు మాత్రమే. Call: 9391873337 [S-1191145]

స్థలం అమ్మకం

■ లంకెలపాలెం ఉడా లే అవుట్‌లో 333 గజాలు స్థలం అమ్మకం. సౌత్ & వెస్ట్ కార్నర్ బిట్. గజం కేవలం 6,999/- మాత్రమే. ఫోన్ : 93932 71777 [V-780434]

PLOT FOR SALE

■ 220 Sq.Yds VUDA Approved Plot at Gudivada Village Near Avanthi Engg College, Tagarapuvalasa. Plot For Sale. Ph : 92900 76667 [V-2140]

■ GVMC 77వార్డులో 5 లక్షలకే 111 గజాలు 55 బిట్లు దగ్గరలో ఇల్లులు, బస్సులు, బజార్, స్పాట్ రిజిస్ట్రేషన్, EMI సదుపాయం కూడా కలదు. డైరెక్ట్ పార్టీస్. ఫోన్ : 73864 14017 [V- 794486]

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 10987]

OLD AGE HOME

■ SVS Old Age Home, VZM రుచికరమైన భోజనం, వసతి A/C, Non A/C రూమ్స్, రాత్రి పగలు ఆయాలు, నర్సుల పర్యవేక్షణలో వయోవృద్ధులకు ప్రత్యేకమైన సర్వీస్ కలదు. సంప్ర : 94404 35006, 93479 78875 [V- 2715]

Wanted

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1221618]

■ విశాఖపట్నం మద్దిలపాలెంలో సెక్యూరిటీ గార్డులు 75 మంది కావలెను. 8 గం॥కు రూ. 12,000/-, 12 గం॥కు 16,500/- PF & ESI ఉచిత నివాసం, సబ్సిడీపై భోజన వసతి. ✆ 70939 31732 [B-1206643]

■ పైజాగ్, షీలానగర్, గాజువాకలో మా ప్రముఖ షాపింగ్‌మాల్ యొక్క గోడౌన్స్ (Ware house) నందు స్టిక్కరింగ్, ప్యాకింగ్ చేయుటకు 18-35 సం॥లు గల యువతీ, యువకులు కావలెను. జీ : 9,000/- ఫోన్: 97046 37370, 97051 94330 [V-26452]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221708]

■ Wanted Male Class Incharges and Marketing Executives. Qualification Any Degree, Age Limit: 20 to 45 years. Place of Work Master Minds College. Vizag, Gajuwaka. Salary Negotiable. Contact: 8008556073, 9989893943 [G-4655]

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీతం:18K. హైదరాబాద్ Ph: 9640258899, విజయవాడ: 9640648899 [HA-612]

సినిమా వార్తల కోసం లాగిన్ అవ్వండి www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!! సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అద్దెకు, అమ్మకం, రియల్ ఎస్టేట్, ఫర్నీచర్స్, ఆటోమొబైల్స్, కంప్యూటర్స్, సర్వీసెస్, కావలెను

మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి

మురళీనగర్, మాధవధార	90101 33346
NAD, కంచరపాలెం	90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ, MVP కోలనీ, మద్దిలపాలెం	90101 96663
గాజువాక	97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా నాలుగు లైన్లు రూ.475/- అదనపు లైను రూ.100/- + 5% జి.ఎస్.టి. అదనం

వైభవంగా వైశాఖీ నృత్యోత్సవం

ముగిసిన భారతీయ నాట్యకేళీ సంరంభం



పేరిణి నాట్య కళాకారిణి డాక్టర్ కళాకృష్ణ నాట్య విన్యాసాలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ

మద్దిలపాలెం : వైశాఖీ నృత్యోత్సవం వైభవంగా ముగిసింది. దేశ నలుమూలల నుంచి ప్రఖ్యాత నాట్యకౌముదులు తరలివచ్చి నాట్యం చేశారు. కథక్, భరతనాట్యం, కూచిపూడి, మోహినీయట్టం, సంబల్‌పూరీ జానపద నృత్యం, తెలంగాణ పేరిణీ నాట్యం... ఇలా భారతీయ సంస్కృతిలో ప్రముఖ కళా నృత్యాలన్నింటికీ గత మూడు రోజులుగా మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో వైశాఖీ నృత్యోత్సవం వేదికగా నిలిచింది. సాంస్కృతిక రాజధానిగా ప్రాముఖ్యతను సొంతం చేసుకున్న విశాఖ గడ్డ అంతర్జాతీయ నాట్య కళాకారులను సత్కరించుకోవడంతోపాటు, నాట్యవిన్యాసాలతో పులకించిపోయింది. అంగరంగ వైభవంగా సాగిన వైశాఖీ నృత్యోత్సవం ఆదివారంతో ఘనంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి అనకాపల్లి జిల్లా ఎస్పీ మురళీకృష్ణ, వీవీ రమణమూర్తి హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు, ఫెస్టివల్ డైరెక్టర్ బత్తిన రంగ విక్రమ్ కుమార్‌గౌడ్ నేతృత్వంలో వైశాఖీ జీవన సాఫల్య పురస్కారాన్ని తెలంగాణకి చెందిన పేరిణి నృత్య కళాగురువు డాక్టర్ కళాకృష్ణకు అందించారు. వైశాఖీ ఎక్స్‌లెన్స్ అవార్డులను కూచిపూడి నాట్య గురువు కన్నం వెంకటరమణారావుకు, డాక్టర్ ఖాజా వి.సుబ్రహ్మణ్యంకు అందజేశారు. జాతీయ యువ పురస్కారాన్ని తెలంగాణకు చెందిన కూచిపూడి నాట్య కళాకారిణి క్రాంతి నారాయణ్‌కు, వైశాఖీ నాట్యశ్రీ అవార్డుతో ఒడిశాకు చెందిన మయూర్ భంజ్ ఛౌను సత్కరించారు. అనంతరం ఆంధ్రా నాట్య విన్యాసంతో జీవన సాఫల్య పురస్కారగ్రహీత డాక్టర్ కళాకృష్ణ, తర్వాత ఒడిశాకు చెందిన మయూర్ భంజ్ ఛౌ బృందం నాట్యవిన్యాసంతో అందరి హృదయాలను కట్టిపడేసింది. తెలంగాణకు చెందిన కూచిపూడి నాట్య కళాకారిణి క్రాంతి నారాయణ్ నాట్యాలయ బృందం కూచిపూడి నాట్యంతోపాటు చాండలిక నృత్యరూపకంతో ఆకట్టుకుంది. ఈ నృత్యరూపకం ఆద్యంతం ఎంతో ఆసక్తికరంగా ప్రేక్షకులను కట్టిపడేసింది. అనంతరం వేడుకల్లో పాల్గొన్న కళాకారులను నిర్వాహకులు సత్కరించారు.